NATIONAL ARCHIVES OF INDIA

10 P
2752
Te

NATIONAL ARCHIVES LIBRARY.
GOVERNMENT OF INDIA
NEW DELHI.
1594/10/71
Call No.
Book No. 2752

Telugu

Poetry

NATIONAL ARCHIVES OF INDIA

LIB 946176 P3

జ్యము ధ

NATIONAL ARCHIVES OF INDIA

Telegu — "Vajrayudham"
from Madras

NATIONAL ARCHIVES
LIBRARY
No. 48
Date 24.6.50
GOVT. OF INDIA.

NATIONAL ARCHIVES OF INDIA

వ జ్రా యు ధ ం

అవంతీ ప్రెస్ - రాజమండ్రి.

వజ్రాయుధం

సోమసుందర్

NATIONAL ARCHIVES OF INDIA

★

మొదటి ముద్రణ : వెయ్యి ప్రతులు

హక్కులు : సోమసుందర్ వి

వెల : రూపాయి

★

NATIONAL ARCHIVES LIBRARY
No 2752
Date 2.3.72
GOVT. OF INDIA

విరోధి : ఉగాది

అభ్యుదయ రచయితల సంఘం తరపున

కళాకేళీ ప్రచురణ 3

సామర్లకోట.

నా

భావంలో భావమైన

భావనకి

NATIONAL ARCHIVES OF INDIA

"Art is an invincible weapon
in the hands of People."

NATIONAL ARCHIVES OF INDIA

ప్రవేశిక.

‘ప్రస్తుతాన్ని గౌరవించనివాడు గతాన్నిసైతం గౌరవించలే’డని ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ అన్న మాటను కొంచెం సమన్వయించుకుంటే, గతాన్ని మరచినవాడే ప్రస్తుతాన్ని పరిత్యజించి ఊహాగానం చెయ్యటం కనిపిస్తుంది. దీనికి మన భావకవిత్వం చక్కని ఉదాహరణ.

వీరేశలింగం, గురజాడ, గిడుగులు ప్రజాసాహిత్య ప్రయోజనాన్ని నిర్వచించటమే కాక, ప్రజాసాహిత్యానికి పునాదులు వేసారు. కాని వారి వెనువెంటనే వచ్చిన భావకవులు వారి సంప్రదాయాన్ని దిగవిడిచి, తమ కాలపు జీవితానికి దూరంగా ఒక స్వాప్నిక జగత్తువైపు తిరోగమించారు. జీవితాన్ని ద్వేషించి, చీకటినీ, మృత్యువునూ వరించారు. జీవిత సంఘర్షణను ఎదుర్కోలేక పలాయనం చిత్తగించారు.

ఈ భావకవుల ‘ముభావ’ సంస్కారాన్నీ, ‘అభావ’ కవిత్వాన్నీ తిరస్కరించి, గతంలోని ఉత్తమ కవితా సంప్రదాయాలను స్వీకరించిన అభ్యుదయ రచయితలు వాస్తవ జగత్తును గుర్తించి తమ కాలాన్నీ, ప్రజానీకాన్నీ, ప్రజల పురోగమనాన్నీ చిత్రిస్తున్నారు. చీకటినీ, మృత్యువునూ ప్రతిఘటించి, కాంతినీ, జీవితాన్నీ ఉపలక్షిస్తున్నారు. వాస్తవిక దృక్పథంతో ప్రజాజీవితానికి కళారూప మివ్వటానికీ, మళ్ళీ మన కళారంగంలో మానవ జీవితాన్నీ మానవత్వాన్నీ పునఃప్రతిష్ఠ చెయ్యటానికీ పూనుకున్నారు.

నేటి జీవితంలోని ఒక మహోద్ధృతమైన సంఘర్షణను. ఒక మహాప్రస్థానాన్ని ప్రతిబింబిస్తున్న ఈ మహాకవిత్వం ప్రతి ఒక్క మానవ హృదయంలోను ప్రతిధ్వనిస్తున్నది. ఇది కేవలం 'ఆకలి' కవిత్వమని త్రోసిపుచ్చ జూసే పెద్దలు. ఈ కవిత్వాన్ని కాదు, 'ఆకలి' నైనా త్రోసిపుచ్చగలరేమో ఆలోచించటం మంచిది. ఏమైనా, ఈ రచయిత అన్నట్లు –

"విశ్వవాణి గొంతుకలో
కొత్తజీర పలుకుతోంది!"

ఇది అప్రతిహతంగా పలికితీరుతుంది. ఈ పలుకులో ఒక్క కవి హృదయమే కాక ప్రపంచ ప్రజాహృదయం కూడా స్పందిస్తున్నది.

ఈ వాస్తవిక కవిత్వానికి 'మహాప్రస్థానం', 'నయాగరా', అనిశెట్టిగీతాలు, ఆరుద్ర మొదలైనవారి రచనలు ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఇలాంటి ఉత్తమ కవితా సంప్రదాయానికి చెందిన ఈ 'వజ్రాయుధం' ఆంధ్ర ప్రజల, సాహితీపరుల ఆదరాభిమానాలను చూరగొంటుందని ఆశిస్తున్నాము.

– ప్రయాగ.

సమధర్మం

తన చరిత్ర తనె పఠించి,
ఫక్కున నవ్వింది ధరణి;
తన గాథను తనె స్మరించి,
భోరున ఏడ్చింది ధరణి.

వృద్ధజగతి సమాధిపై సమధర్మం ప్రభవించును;
నిద్దుర చీకటి వెలుపల వేకువ మెఱుకువ పుట్టును.

ధరణీచక్రం గిర గిర
పరిభ్రమిస్తోం దదిగో!
నిమ్నోన్నతముల జగతికి
ఉద్వాసన చదువుతోంది.

'పరాధీన పురాలోక వక్రగతీ కృతకత్వం;
నిరాశానలమ్మై దీనుల వ్రేల్చిన కుటిలత్వం!'

దరిద్ర ధరణీ గీతికి
ఆకాశం ద్రవించింది;
దరిద్ర ధరణీశోకం
దిక్కులలో ధ్వనించింది.

నిద్దుర కనురెప్పలలో నిలచిన నీడలె పడగల?
హద్దుల అవకాశాలే బలిపశువుకు పాశాలా??

ప్రజల పుత్రకామేష్టికి
భూదేవత ప్రసవించెను;
పురిటిబిడ్డ, క్రాంతి శక్తి,
భువిక్షీరం గ్రోలుతోంది.

నిన్నా నేడుల కృషియే రేపై జన్మించుతుంది;
ఓహోహో! మానవుడా! సంధించుము, ధనుష్కోటి!

నిరంకుశుల ఆక్రమణకు
శరణాగతుడే నరుడా?
నరకాసుర చెరసాలల
పుడమితల్లి పసిగందులె బందీలా?

ధరణీ తనూజులు నేటికి-దనుజులకే బానిసలట!
తరుణ జీవన జ్యోతులు నిశాచరుల బాటలకే దీపాలట!!

కృపాణముల ధగద్ధగలు
దిక్కులలో ప్రతిబింబించెను;
ప్రతీకార రణదుందుభి
దిక్కులలో ప్రతిధ్వనించెను.

పగిలిన నిశ్శబ్దంవలె పగ్రతాచులు లేచినవో!
రగిలిన ప్రళయజ్వాలా తాండవ కోలాహలమో!!

నిర్భాగ్యుల గుండె చీల్చి,
ధనికులు త్రావిన రక్తం;
నరభక్షకుడగు దుందుభి
కట్టిన ఎముకల దుర్గం;

వర్ధమాన లోకంలో వ్యర్థగాథలై తీరును;
భవిష్యత్తు వెలుగుల్లో చెరిగిన వెతలై పోవును.

తన గాథను తనె పఠించి
ఫక్కున నవ్వింది ధరణి;
తన చరిత్ర తనె స్మరించి
భోరున ఏడ్చింది ధరణి.

వృద్ధజగత్సమాధిపై సమధర్మం ప్రభవించును;
నిద్దుర చీకటి వెలుపల వేకువ మెఱుకువ పుట్టును.

ధరణీచక్రం గిర గిర
పరిభ్రమిస్తోం దదిగో!
నిమ్నోన్నతముల జగతికి
ఉద్వాసన చదువుతోంది.

* * *

భువి తనయుల క్రాంతిశక్తి ఎత్తిన రక్తధ్వజం!
దద్దరిల్ల దశదిశలను. సోకిన విప్లవకంఠం!!

భువి యొక విప్లవ మూర్తై,
నిలువుకాళ్ళ నిలుస్తోంది;
అరుణారుణ పతాకమై
ఆకాశం మెరుస్తోంది.

యుగధర్మం: చైతన్యం - జనహృదయం: పోరాటం.
తిరుగుబాటు! తిరుగుబాటు!! తిరుగుబాటు - బావుటా!!!

తిరుగుబాటు - బావుటాలు
జగమంతా నిండినయ్;
శత సహస్ర కంఠమ్ములు
ప్రతిచోటా కలిసినయ్.

ఇదుగో! విప్లవ దుందుభి వినిపించిన సందేశం:
'భువి సమస్త సంపదలకు అధినాథులు మానవుల'ట!

ధరణీ గీతం లోపల
నవ శ్రుతులే పలికినవట!
ధరణీ హృదయంలో నవ
సమాజమే వెలిసినదట!

వృద్ధజగతి సమాధిపై సమధర్మం ప్రభవించును;
నిద్దుర చీకటి వెలుపల వేకువ మెఱుకువ పుట్టును.

ధరణీచక్రం గిర గిర
పరిభ్రమిస్తోందదిగో!
నిమ్నోన్నతముల జగతికి
ఉద్వాసన చదువుతోంది.

★

ధ్రువతార

ఓ లెనిన్ ! .... మా లెనిన్ ! !
నిరాశానలమ్మున పడి
అణగారే మా ఎదలన్.
నీ వచస్సుధా లహరిన్
ముంచిన మహనీయ లెనిన్ !

శత సహస్ర విశ్వ శ్రామిక
సేనల అక్షౌహిణి
కధినేతా .... మా లెనిన్ !

నీ నామమె సమ జగతీ
నిర్మాణోత్సవ మాయెను ;
నీ మాటయె వర్గరహిత
స్వర్గానికి బాటాయెను !

కలకాలపు పీడకలలు
కలచిన ఈ పురాలోక
శాంతికి విప్లవశంఖం
వినిపించిన మా లెనిన్ !

పరపీడన పరాయణుల
ఎదలో నాటిన బాకై

నరహంతక ధరాధిపుల
బ్రతుకులకే స్మశానమై
నీ వెత్తిన జెండా ....
అరుణారుణమై వెలుగుతోంది !

దిగ్దిగంతముల గొంతులు
విప్లవమై మ్రోగుతున్నయ్ !!

నీ పవిత్ర దేశం - ఈ
భువిలో నిర్మిత స్వర్గం
నరజాతికి విముక్తిగా
పరమావధి ధృవతారగ
వెలుగుతుంది చిరకాలం !

నవశక్తి విధాతా !
సమ జగతీ నేతా !!

★

ఖరార్‌నామా

జన్మెత్తిన మానవునకు
జీవితమే పరమధనం ;
అయితే, అది ఒకమారే
అతని కొసగబడిన వరం.

పుట్టలోని పురుగులవలె,
పుట్టి పెరిగి,
సంఘంలో తావులేక,
అస్తిత్వ ప్రయోజనం
ఊహకు అందనిదవగా,
తన చరిత్ర చెరిపేసుక,
తనదారిని వెళిపోయే
మానవుడిక పుట్టబోడు ;
సుడిగుండంలో పడి తిరగడు.

* * *

ఎపుడో అజ్ఞాతయుగంలో,
నీపై కప్పబడిన దుప్పట్లే,
దుష్ఫలితాలై, దుర్భరమైనా,
తొలగించే శక్తిలేక,
మరణబాధతో గిలగిల

తన్నుకునేందుకు.
జన్మించావా ? మనిషీ !

పిరికితనపు సిగ్గుల కగ్గలమై,
దగ్ధపటలమై, పొగచూరిన
భూతకాల మర్యాదలు -
వ్రేలాడే బూజులు -
వేటాడే భూతాలై నిను తరుముతుంటె
పిరికిమందు తింటావా ?
నరుడా !
వీరునివలె తిరుగుబాటు చేస్తావా ?

ఉన్నదొక్క జీవితమే ;
మానవునిగ, వీరునిగా
బ్రతుకుము నరుడా !
చరిత్ర నీకోసం
ప్రసవబాధ పడుతున్నది !
భవిష్యత్తు నీకోసం
పడిగాపులు పడుతున్నది !

అర్పించెయ్ నీ రక్తం మనిషీ !
నీ త్యాగం వృధా కాదు !
నీ త్యాగం వృధాకాదు !

ప్రయోజనం లేని
బరువు లేళ్ళు మోసి మోసి
బడుగై పోయిన
దరిద్రమున కనలు బ్రతుకు ;

గొలుసులోని కుక్క బ్రతుకు -
చాలు చాలు నరుడా! బ్రతుకలేవు.

ఉన్నది ఒక బ్రతుకే;
గతమును ఒక్కసారి విస్మరించు;
శూరుడవై శృంఖలముల ఛేదించు.

ప్రభవించే శాంతి జగతి
సువర్ణ దీధితి నీకే,
ముమ్మాటికి నీ తమ్ములకే -
మనిషీ! - నీరాజన మిస్తుంది.

పుట్టే నీ బిడ్డడు
దరిద్రమున, దోపిడిలో,
బ్రతుకడు; బ్రతుకలేడు.
ఏవో
ఆశల నిచ్చెనలను నిర్మించుక,
నిట్టూర్పుల వంతెన కట్టుక
స్వప్నాలోకనలో స్వర్గలోక
సౌఖ్యాలను తలపోస్తూ,
పుట్టే పాపాయిక
బ్రతుకలేడు: బ్రతుకడు.

* * *

స్వేచ్ఛకొరకు జరిగే
విప్లవ సమరంలో
క్షతగాత్రుడవై పడిపోయిన మనిషీ!
గాయపడిన సింహంవలె
గర్జించిన నీ కంఠధ్వని

రాబోయే స్వర్ణయుగానికి జయభేరీ!
నీ జీవితమొక రహదారీ!

నవ సమాజ వ్యవస్థకే
బీజాక్షర నామకరణ మహోత్సవం!
నీ గొంతు కొసలు
దేశభక్తి నిర్వచనాలై
అహరహముగ నిలుస్తాయి;
జీవిత బలిదానం చేసిన మనిషీ!
నీ వచనాలే లోకపు
అంతిమ ఘడియల వరకూ
ప్రతిధ్వనిస్తాయి!

రక్తం అర్పించుము నరుడా!
నీ త్యాగం వృధాకాదు;
నీ త్యాగం వృధా కాదు.

★

NATIONAL ARCHIVES OF INDIA

మౌన ఘోష

ఆకలి వేస్తోందమ్మా!
అన్నం పెట్టమ్మా!!
స్వర్ణారుణ
సస్యశ్యామలమగు
ఈ జగతిని, దరిద్రమున,
ఆకలితో, చావలేను!

ఆశాసుమ మాలా
సౌరుభమిది వీడలేను!

ఆకలి! అమ్మా ఆకలి!!

అన్నపూర్ణ గర్భగుడిని
ఆఖరి గంటలు మ్రోగెను;

ఆరని ఆకలి కీలలు
భైరవనాట్యము చేసెను;

ఘోర పరాజయమా ఇది?

మానవ మారణ హోమం!

తల్లీ! ఆకలి ....! ఆకలి ....!!

ఆకలి నాగుల నాలుక
అగ్నిజ్వాలల నెగజిమ్ముతోంది!

అమ్మా ....! ఆకలి!! ఆకలి!!!

నా కడుపొక బడబానలమై
మండుతోంది తల్లీ ....!

లోకం నరహంతక కంటకముల
కావృతమై ఘోండ్రిస్తోంది!

లోకం పరాన్నభుక్కుల చేతులలో
పరాధీనమై విలపిస్తోంది!

తల్లీ! ఆకలి ....! ఆకలి ....!!

నాలో చెలరేగిన
ఆకలి కంతిమ ఆశ్వాసం ఎచటో?
తుది మజిలీ ఎపుడో?

మృత్యువు మృత్తికలో
దాగుంటోం దదిగో ....!

పేదల నిర్భాగ్యుల రక్తంతో
స్మశానాలు శాసనాల
వ్రాస్తున్నాయవిగో ...!

అమ్మా! ఆకలి .... ఆకలి ....

నాలో, నరాలలో, లోపలి
గడియారం తలుపుకు
ఘడియ పడిం దెపుడో ....!

ఆకలి నన్నీ లోకం
నుంచెడబాపులు
చేసేందుకు చూస్తున్నది !
అమ్మా .... చావలేను ! చావలేను !

నరు లందరికీ
సరిపోయే సిరి సంపదలతో
తులతూగే ఈ దేశం నాదమ్మా !
తల్లీ ! విడువలేను
నా, యీ, అందమైన లోకం !

అమ్మా !.... ఆకలి .... ఆకలి ....

★

లోపలి కోరిక

తల్లి : నీ హృదయం
నెత్తురు చిందిన గెడ్డయి,
తుఫానులో రాలిన
జీర్ణపత్రమై,
ఎగసి ఎగసి, పరితప్తమగుట
దేనికొరకు బిడ్డా ?

కవి : నీ బిడ్డలు
దిక్కులేని పిట్టలవలె,
చెట్టుకొకరుగా
చెల్లాచెదరై
గూడులేక, కూడులేక,
అల్లల్లాడుట
చూడలేక తల్లీ !

తల్లి : ఇంత భయోత్పాతంలో
గాఢ నిశాధ్వాంతంలో
ఏగెదవెలాగ బిడ్డా ?

కవి : నలుబది కోట్లకు మించిన
సంతానం కన్న తల్లి !
నీ చల్లని దీవెనలో
పురోగమిస్తా నమ్మా !

తల్లి : నాపై ప్రసరించిన
నీ లోపలి కోరిక ఏదో
చెబుతావా బిడ్డా !

కవి : అమ్మా, చెబుతా వినవమ్మా :
నీ చేతుల బంధించిన
సంకెళ్ళను త్రెంచాలని;
నీ సంతతి స్వేచ్ఛలోన
ఊపిరి పీల్చాలని
దినమంతా రక్తం ధారవోసి
పరిశ్రమించే దీనుల
ఒక్కటిగా ....
సమీకరించుటకోసం తల్లీ !
నిర్దయగా పరాన్నభుక్కుల
హతమార్చుటకోసం, తల్లీ !
వర్గరహిత స్వర్గమ్మును
స్థాపించుటకోసం తల్లీ !
ఇది నా లోపలి కోరిక !
ఇది నా తీరని తపస్సు !!

★

NATIONAL ARCHIVES OF INDIA

భగత్సింగు

ఒక తారక మేల్కాంచెను ;
ఒక వీరుడు కను విచ్చెను.

ఒక మెఱువు !
ఒక్క వెలుగు ! !

* * *

ఆ తారను పీకనులిమి
చంపిందేదో చీకటి !
ఆ వీరుని పీక నులిమి
చపిందేదో పిశాచి ! !

* * *

కోటికోట్ల తారకలు !
బారులు తీరిన తారలు .... ! !

మహా కాంతి !
మహా కాంతి ! !

చీకటి కడుపున చిల్లులు ;
చీకటి గుండెకు తూటులు.
నవ జగతీ యువ వీరులు ;
భవిష్యత్తు కధినేతలు.

మహా క్రాంతి !
మహా క్రాంతి ! !

చీకటి పిశాచి చచ్చెను :
తాటకి వలె, పూతన వలె,
మేరువుగా శవం పడెను.

*　　*　　*

తొలి తారక తేజం,
యువ వీరుని తేజం,
క్రాంతికాల జాగృతియై
లోకం ముంచెత్తివైచె :

*　　*　　*

అంచాతనె ఆకాశం
అరుణోదయమై వెలిగెను ;
అంచాతనె భూలోకం
తిరుగుబాటు - ఎరుపెక్కెను ! !

*　　*　　*

అరుణ పతాకచ్ఛాయల
ఆయుధాల ప్రవాహమై,
అక్షయ తూణీరం వలె....
అక్షీణ పరాక్రమం వలె....
బారులు తీరిన వీరులు !
భారత విప్లవ యోధులు ! !

*　　*　　*

ఒక వీరుడు....
ఒక తారక....
ఒకటే ఒక కాంతిరేఖ !
లోకం తొణికిసలాడిన -
మహా కాంతి !
మహా క్రాంతి !

★

ఫ్యాక్టరీ

అదిగో అది ఫ్యాక్టరీ.

ధన మదాంధ అధికారుల
కనికార రహిత గర్వం,
ఆకృతియై
నిలచిన ఫ్యాక్టరీ!

అదిగో అది పొగ గొట్టం.
ధనస్వామి నిర్దయ వలె నించుని
భుగభుగమని
పొగ లెగ జిమ్మే చిమ్నీ!

లోకపు అవకాశాలకు
కారు రంగు
మసిపూసే చిమ్నీ!!

అదిగో అది ఫ్యాక్టరీ!
అహంకార ధిక్కృతిగా
భువి పేగులు దద్దరిల్ల
నీతిమాలి గర్జిస్తోం దదిగో!

గత కాలంలో
కుక్కి-మంచమున వాల్చిన
కళేబరాలను నడుపుత

ఆలోచన చేయలేని
అలవాటుకు బానిసలై
బిలబిలమని నిముషంలో
వచ్చేస్తున్నా యవిగో!

చూస్తున్నావా?

మానవులేనని పొరబడుతున్నావా?

కావవి; స్నేహితుడా!
మానవులే కావవి.

రెండు కాళ్ళపై కదిలే
యంత్రాంతర్భాగమ్ముల దేహమ్ములు
ప్రతి స్వేద బిందువులో,
రక్తం వాహినిగా ధారవోసి,
తేనెను సమీకరించేందుకు మాత్రం,
పుట్టిన కూలీలవి;
చూస్తున్నావా?

బాధార్ణవ అగాధ గర్భంలో పడి
దిక్కూ తెన్నూ కానక
ఘూర్ణిల్లే నిర్భాగ్యులు!

కూలీలట వాళ్ళే!!!

యజమానుల లోహపు గుండెల
అమానుషత్వానికి హడలే
కూలీలరుగో! అరుగో!!

దీనత నిస్తబ్ధత
భయభ్రాంత భావమ్ములు

మూర్తిగానే ముఖాలతో -
జీవకళా రహితమ్ములు
దేహమ్ములు ;-
వారా ? మానవులా ? ! ?
సత్వ్వరూప వారసులా ! ?
రక్తమాంసములు కలిగిన
యంత్రాంతర్భాగమ్ములు.

కలవారల సుకుమారుల
కన్నతండ్రి అతడేనా ?
పరమేశ్వరు డతగాడేనా ?
ఈ జీవచ్ఛవముల సృష్టికర్త !

వీళ్ళంతా కూలీలై
సోమరిపోతులకోసం
అపార సౌఖ్యాలను
సమకూర్చేందుకు మాత్రమె
పాపం వీరిని సృష్టించాడా ఏం ?

చెవుల్లేని కారురాతి దేవుడు ;
గుండెలేని బండవెధవ దేవుడు.

ఈ ఫ్యాక్టరీలు చేసే
గందరగోళంలో
అగణిత కార్మిక
హృదయాందోళన
వినబడటంలేదా వాడికి !

అదిగో.... అటు చూడు!
ప్రతి నిత్యం ఫ్యాక్టరీ -
కూలీ యెముకల నెన్నో
సున్నంగా చిదుకకొట్టి
రక్తంతో రంగరించి
ధనస్వామి పాదమ్ముల -
పారాణిని పూస్తున్నది!
చూస్తున్నావా నేస్తం?

దీనుల రక్తంతో తడిసిన మన్నే,
ఎండిన ఎర్రని బూడిదగా,
రోడ్డుమీద ఎగురుతోంది;
చూస్తున్నావా నేస్తం?

శతాధిక నిర్భాగ్యుల
రుధిర స్వేదమ్ముల తడిసిన
బెందడితో నిర్మించిన
దేవళమున, మసీదులో
కులికే ఓ పరమేశ్వరుడా.

చెవుల్లేని కారు రాతిదేవుడు;
గుండెలేని బండ వెధవ దేవుడు.

ధనస్వామి అధికారం
దీనుల కృషిఫలితం దోచుకునే
విషయం గమనిస్తూ
మాటాడని దేవుడు!
న్యాయం చేస్తాడా నేస్తం?

NATIONAL ARCHIVES LIBRARY
No 2752
Date 2·3·72
GOVT. OF INDIA

ఫ్యాక్టరీల యజమానులు
భూరి విరాళాలతో
దేవుని కొనివేశారయ్యా!
ఎన్నాళ్ళో అయింది.

చంద్రకాంతశిలా వినిర్మిత
దేవళమున బంధించారయ్యా!
ఎన్నాళ్ళో అయింది!!

అంచాతనె దేవుడు
ధనస్వామి నమ్మిన బంటై,
పేదల అన్నార్తుల దీనారవముల
శ్రవణాలకు చేరువ కానీయడు.

(దేవుని శ్రవణ పుటమ్ముల
కరగించిన సీసం
పోశాడట ధనస్వామి!)
సందేహం దేనికి?
స్నేహితుడా! యిది సత్యం.

●

అదిగో అది ఫ్యాక్టరీ:
శక్తిలేని హీనస్వరమున
అలసిన పెనుభూతంలా,
బెబ్బులిలా,
గర్జిస్తున్నది ఫ్యాక్టరీ.

స్పృహ తప్పిన భుజగం వలె
భుగభుగమని
పొగలెగజిమ్ముతోంది చిమ్నీ!

NATIONAL ARCHIVES LIBRARY
GOVT. OF INDIA

నెత్తురు కక్కుతూన్న
తూట్లుపడ్డ పూపిరితిత్తుల వలె
నల్లనిపొగ చిమ్ముతోంది చిమ్నీ!

చిమ్మినపొగ, చీకటి వలె,
ఆకాశం కడుపున విడి
పడిపోతున్నది;

గతకాలపు చరిత్ర వలె
స్వార్థపరుల గాథల వలె,
పటాపంచ లవుతున్నది.

అగణిత అసంఖ్యాక
శత సహస్ర నిర్భాగ్యులు
నవోత్తేజ వాహినిగా
వస్తున్నా రదుగో!
లోకం
ముంచేస్తున్నా రదుగో!

స్నేహితుడా! చూస్తున్నావా?

అనితర సాధ్యమ్మగు
ప్రజాశక్తి సైన్యాలై
విలయకాల రౌద్రంతో,
విప్లవ చైతన్యంతో,
పురోగమిస్తున్న దదిగో!

చూస్తున్నావా? నేస్తం!

ధనస్వామి దోపిడితో
కట్టిన బలవద్దుర్గం
పునాదితో కదులుతోంది ;
ఫటఫటమని పేలుతోంది.

సందేహం దేనికి ?

స్నేహితుడా !
భూమట్టం అయితీరును.

దోపిడీంద్ర కాలరాత్రి
సమీపించి తీరుతుంది.

లక్షలాది పీడితజన
సందోహ మ్మదిగదిగో !
కదులుతోంది బారులుగా.

కార్మిక కోపాగ్నిచ్ఛటలకు
తాళలేని శలభం వలె,
ధనస్వామి తపతపమని
పాదాంతం వణికిపోయి
విప్లవ శక్తికి
పాదాక్రాంతుడయే.
శుభసమయమ్మిదె
ఆసన్నం అవుతున్నది ;
ఆరంభించిందపుడే.

★

బాడుగగోడీలు

పాపం
లోకం కోపం
విసరిన శాపం
లోకం కోపం
రువ్విన కారం
కనికారం
లేని ప్రతీకారం
కారణం
లేని ప్రతీకారం
నేరం
లేనివాళ్ళ
కుటుంబాలు కనడం
అపచారం
లోకం
అచ్చొత్తకపోడం
లోకం
వేసిన సుంకాలను
చెల్లించలేని అపచారం
దావాలో
నెగ్గిన లోకం డిక్రీలకు
చెల్లించిన అనుభవం

NATIONAL ARCHIVES OF INDIA

లోకం లావాదేవీలకు
వెచ్చించిన ఆనందం

పాపం
పాపపు కూపం
వంటి జీవితం
కుల కుల కులికే
సమూహాల కూపం

ఒక్క బ్రతుకు నోములు
వాయినాల నాములు
జమకట్టేందుకు పట్టే
పది బ్రతుకుల జీవితం

పూల ఖర్చు
గడుపుకొనేందుకు
లోకం మార్వాడీ కొట్లో
విశ్రాంతిని
తాకట్టుపెట్టిన జీవితం

పందెం బిరిలోని
చావూ బ్రతుకుల
పోటీ ఆటలకోసం
ఎర్రని పొట్లాం విప్పిన
ఊలుబంతి జీవితం

ముళ్ళకంచెపై
ఆరేసిన జీవితం

ఊరవతల పుంతలో
పారేసిన జీవితం
ఎర్రని జీవితం

డబ్బుకోసం
జబ్బులు కొనుక్కుంటూ
డబ్బుకోసం
జబ్బు లమ్ముకుంటూ
బతుకుతున్న
అంగడి జీవితం

అద్దెకొంప జీవితం
ముక్కానీకోసం
బిళ్ళలు వాపసుచేసే
పోస్టాఫీసు జీవితం

ఆయుర్దాయం
మొహంమీద
గబ గబా నడచి
ఆగిపోతున్న
పెద్దముల్లు జీవితం

బతకడంకోసం
రాత్రింపవళ్ళు
గతుకుల దారుల్లో
కాళ్ళరిగేట్టు చేసే
స్వారీలో
లాగలేక ఈడుస్తూ
ఈడ్వలేక ఏడుస్తూ

పడుతూ లేస్తూ
గడుపుతున్న జీవితం
నెత్తురు కారుతున్న జీవితం

చిట్టచివర
కొమ్మకు
వేలాడుతున్న
తేనెపట్లకోసం
ఎగబాకే రాపిడి జీవితం

అనవరతం
నావకొసల పాకుడులో
జారుతున్న జీవితం

●

పాపం
లోకం
మర్యాదస్తుల
లంచంతో
అపచారాలకు
పట్టాలిచ్చిన లోకం

లేనివాళ్ళ
జీవిత కులాయం
పునాదితో
కుదుమట్టంగా
కుళ్ళపొడిచిన
బందిపోటు లోకం

లేనివాళ్ళ
నారింజ యవ్వనం
రెండు ముక్కలు చీల్చి
గ్లాసునిండా పిండి
చివరి చుక్కవరకూ
గుటగుటా గుటగుటా
త్రాగేసిన లోకం
దొంగచాటు లోకం

లేనివాళ్ళ
పచ్చని పండులాంటి
నూరేళ్ళ జీవితంపై
పగబట్టి వెంటాడే
నాగుపాము లోకం
దొంగకాటు లోకం

బుసబుస పొంగే
విషభాండం లోకం
దొంగచాటు లోకం

●

అయితే
నూరేళ్ళూ నిండిన
ఈలోకం
చావక తప్పదు

పాపం పండిన
ఈ లోకపు
నెత్తిమీద నిండుకుండ

రేపో ఎల్లుండో
భళ్ళున బద్దలవక మానదు
లేనివాళ్ళ
నరాల రక్తం సారా
త్రాగి త్రాగి మత్తెక్కిన
కలవారల పొగరుమోతు లోకం
రేపో ఎల్లుండో
కూలిపోక మానదు
అప్పుడుమాత్రం
ఈ జీవితం
ఒక్కమారుగా
తన బరువులు
దింపుకుంటుంది.
అప్పుడుమాత్రం
ఈ జీవితం
ఒక్కసారిగా
తన అపచారాలను
విడుదల చేస్తుంది.
అప్పుడుమాత్రం
ఈ జీవితం
తన గాయాలను
మాన్పుకుంటుంది.
ఆరోగ్యం కోలుకుంటుంది
హాయిగా గాలి
పీల్చుకుంటుంది!

★

ఆకలి నాలుకలన్నీ ....

కాలం బ్రదుకు తెరువు ప్రక్కన
విరిసిన దిరిసెన చెట్టుక్రింద
మసగ మసక నీడల్లో కూర్చుని,
పాపం! — ముదుసలి చరిత్ర
పూర్వగాథ స్మరిస్తోంది!
గతానుభూతుల
పచ్చని, నులివెచ్చని జ్ఞాపకాలు
నెమరేస్తోంది!!

ఈ కుచేల అన్నార్తుల లోకం,
ఆకలి కంటుకుపోయిన పొట్టల....
ఆకలి ఆరాటంతో కనలి కనలి
అలమటించి జీరపడిన గొంతుల....
ప్రదర్శనం చేస్తుంటే,
చూడని వినిపించుకొనని
దుర్మదాంధ — దుశ్శాసన
కర్కశ పరిపాలన!

ఆకలి నాలుకలెన్నో
ఏకమగుచు ద్వారంకడ అరుస్తుంటె
'అరచి అరచి అరచి అవే
అలసి తిరిగి పోతవిలే!'

అని తలపోస్తూ
ఆయాసంతో ఒగురుస్తూ,
విలాసాల కైలాసం కట్టుకున్న
కుబేర లాభార్థుల లోకపు
కర్కశ పరిపాలన!

పాపం! చరిత్ర ముసల్ది
నివ్వెర పోతోంది;
ధనస్వామ్య లోకపు కోపం
పేద జనుల లోకంపై విసరిన
పగనాగుల శాపానికి
బెంబేరయింది – పాపం ముసిల్ది.

ఆకలి నాలుకలన్నీ
ఏకమైన రోజున ....
ఆకలి నాలుకలన్నీ
ఏకంగా ముందుకు సాగిన రోజున ...
- సంశయ మెందుకు ?
ఆ రోజున విజయం ఎవరిది ??

ఆకలి నాలుకలన్నీ
అరచి అరచి
ప్రళయంవలె గర్జిస్తాయి!
శ్రమ నెరుగని శ్రీమంతుల
కర్కశ పరిపాలనను
అజేయమై ఎదిరిస్తాయి!

పేదల కష్టాలను,
శ్రమజీవుల స్వేదం బిందువులను,
నాణెములకు మార్చుకొనే
కలవారల, కండకావరుల
కర్కశ పరిపాలనను
పగతీరా బ్రద్దలు చేస్తాయి;
విరామ మెరుగని ప్రగతీరావంతో
ఆకలి నాలుకలన్నీ నినదిస్తాయి!

పాపం చరిత్ర ముసల్ది
ఏదో తలపోస్తోంది;

కాలగతిని పరిశీలిస్తూ,
క్రాంతి తరంగాలను చూస్తూ,
పాపం! చరిత్ర ముసల్ది
పిరికి గుండెవలె బేజారయింది.

ఆకలి నాలుకలన్నీ
ఏకంగా, ఉప్పెనలా, ఉప్పొంగుచు
దుశ్శాసన రాజ్యంలో ....,
ధనస్వామ్య కఠోర పరిపాలనలో,
కుబేర దుర్గాలను
గుభిల్లు గుభిల్లుమని కూలుస్తున్నవి.

కుబేరలోకం సమాధిపై
పేద జనుల కుచేల లోకం ....
కోటికోట్ల గొంతులెత్తి
స్వామ్య జగతి స్వాగత సంగీతం
ఆలాపిస్తున్నది!

కల్లోలిత జనసందోహం చూస్తూ
గజగజ వణికెను భీతికి,
చరిత్ర ముసల్ది పాపం!

కోలాహల స్వాగత గీతికి
కొత్తగాలి పిల్చుతోంది!
జీరపడిన ముసలిగొంతు,
లోలోపల సణుగుతోంది :
"ఒహాహో స్వప్నం కాదుకదా!
ఎంతలోనె ఎంతమార్పు!"

ఆకలి నాలుకలన్నీ
ఏకమైన రోజున ....
ఆకలి నాలుకలన్నీ
ఏకంగా ఉప్పెనలా
ఉప్పొంగిన ఈ రోజున ....
ధనస్వామ్య కఠోర పరిపాలన
ఛిన్నాభిన్నంగా నుసినుసిగా
నశించిపోతున్నది త్వరగా.

పేద జనుల కుచేల లోకపు
ప్రతీకార జ్వాలల్లో....
దుశ్శాసన కర్కశ పరిపాలన
పటాపంచలై భస్మీపటలమై
నశించిపోతున్నది త్వరగా.

మంత్రసాని చరిత్ర ముదుసలి
'కాలగతి'కి — గర్భవతికి
పురిటినీళ్ళు పోస్తోంది.
ప్రభవించే నూతన జగతికి
పురిటిబిడ్డ — 'సమధర్మా'నికి
పురిటి నీళ్ళు పోస్తున్నది
చరిత్ర మంత్రసాని ముసల్ది.

★

బానిసల దండయాత్ర

NATIONAL ARCHIVES OF INDIA

I

రెండు ప్రపంచాల మధ్య
సాగుతున్న సంఘర్షణ :

అసుర వృద్ధ వృకోదరుల.
అంధకార జాత్యంధుల,
అభివృద్ధిని నిరోధించు
ధనస్వామ్య స్వార్థాలకు
అభ్యర్థుల, ప్రతినిధుల
ఏహ్యమాన రుజాగర్భ
తిరోగామి లోకమొకటి.

ప్రజాతంత్ర యుగోద్భూత
శాంతికాల దీపికలై,
పీడితజన సందోహపు
సందేశపు ప్రతిధ్వనులై,
స్వాతంత్ర్యాభ్యుదయాలకు
శాంతిమయ వ్యవస్థకై
పురోగామి లోకమొకటి.

రెండు ప్రంపంచాల మధ్య,
రెండే లోకాల మధ్య,
సాగుతున్న సంఘర్షణ.

యుగధర్మం గుర్తించని,
ప్రజాకాంక్ష చూడలేని,

అధికారపు దివాంధాలు
తమ స్వారీ సాగించగ,
సడలుతున్న సంకెళ్ళను,
విడిపోయే కళ్ళెములను,
సవరించే యత్న మొకటి.

యువశంఖం పూరిస్తూ,
భవిష్యత్తు నాశిస్తూ,
సమధర్మం స్థాపించగ,
పరపీడన మంతరింప,
నరులంతా సౌఖ్యాలను
పంచుకొనే వ్యవస్థకై
సాగించే యత్న మొకటి.

రెండు ప్రపంచాల మధ్య,
రెండు స్వభావాల మధ్య,
రెండే వర్గాల మధ్య,
సాగుతున్న సంఘర్షణ.

చిరంతనపు చీకటిలో,
కాంతిలేని నిరాశతో,
కాచుకొన్న నిర్భాగ్యులు,
దుర్భర దారిద్ర్యానికి,
నరనిర్మిత వక్రగతికి,
స్వస్తిచెప్ప పూనినారు;
కంఠమెత్తి చాటినారు.

తమ దోపిడి, తమపాలన,
తమ వర్గ స్వలాభాల,

సుస్థిరముగ నిలపాలని,
సర్వజనానీకంపై
ఏలుబడిని సాగించగ,
గడియారపు ఉక్కుముళ్ళ
వెనుకకు త్రిప్పారు వారు.

పీడితులంతా ఒకటై,
లక్షల సంఖ్యకు మించిన
అక్షౌహిణులై లేచిరి;
దోపిడికీ, పీడనకూ,
అసమ్మతిని ప్రకటిస్తూ,
స్వస్తిచెప్ప పూనినారు;
కంఠమెత్తి చాటినారు.

అంధకార వృద్ధజగతి
కధినేతలు; అభ్యర్థులు;
ధనస్వామ్య స్వార్థానికి
వెన్నెముకలు; నిట్రాటలు;-
గడియారపు ఉక్కుముళ్ళ
వెనుకకు త్రిప్పారు వారు।

రెండు ప్రపంచాలమధ్య,
రెండు స్వభావాలమధ్య,
రెండే వర్గాలమధ్య,
సాగుతున్న సంఘర్షణ.

★

II

కదలండి, కదలండి,
కదలి పోరాడండి!

కాకతీయుల శౌర్య
పటిమ చూపించండి;
తెలగాణ! తెలగాణ!!
ధీరులకు మొగసాల;
తెలగాణ! తెలగాణ!!
విప్లవోజ్వల గాధ.

నూత్న ప్రజాతంత్ర
జీవనోద్భూతమై
క్రాంతి కాలారుణో
త్సవ జాగృతమ్మాయె;
కదలండి, కదలండి,
కదలి పోరాడండి!

రాక్షసులు, రాక్షసులు
రాజీలు పడ్డారు;
ఘోర హత్యకు మనల
గురిచేసినారు.

తెలుగు వీరుడు మరణ
మెరుగడని చాటండి!

పిరికివానికి వేయి
చావులని తెలుపండి!
పోరండి, పోరండి,
పోరండి బ్రతుకుకై;
పోరండి పుడమికై;
పోరండి స్వేచ్ఛకై.

తుది తెలుగు మానవుడు
బ్రతుకు వీడిందాక;
తుది రక్త బిందువులు
చింది ఒలికిందాక;
పోరండి, పోరండి,
కదలి పోరాడండి.

తెలుగు గడ్డకు దీర్ఘ
హేమంత పంతమై
నవయుగోజ్వల సౌఖ్య
వాసంత మరుదెంచు;
ముక్కోటి తెలుగులకు
ఇది విముక్తికి బాట!
స్వాతంత్ర సమరమున
కంతిమాశ్వాస మిది!!

లేవండి, లేవండి,
ఆయుధాల్ తీయండి;
కత్తితో, కర్రతో,
వడిశాలతో కదిలి,
భస్మాసురున కిపుడె
భరతమ్ము పట్టండి!

రావణులు, మారీచ,
కీచకులు, వంచకులు ;
యుగధర్మ మెదురీది
భస్మమైపోయారు !
హిట్లర్లు, టోజోలు,
జార్లు, గోరింగులూ,
యుగధర్మ మెదురీది
మట్టిలో కలిశారు.

కదలండి, కదలండి,
కదలి పోరాడండి !

రాక్షసులు, రాక్షసులు
రాజీలు పడ్డారు ;
దొంగలంతా కలసి
గ్రామాలు దోచారు.

తీయండి, తీయండి,
రాక్షసుల ప్రాణాలు ;
హైదరాబాదు ఖిల్లా
లోని తొర్రలో, పుర్రెలో,
దాచుకొన్నాడంట !
రాక్షసుడు ప్రాణాలు ;
దేశముఖు కుక్కలను
కాపలా లుంచాడు.

కదలండి, కదలండి,
హైదరాబాదునకు ;

నడవండి, నడవండి,
హైదరాబాదునకు ;
కూల్చండి, కూల్చండి,
ముష్కరుని దుర్గాలు.

నరరక్కసుని పాతి
పెట్టండి ! పూడ్చండి !!

మన విశాలాంధ్రలో
స్వర్గమును నిలుపండి !
కదలండి, కదలండి,
కదలి పోరాడండి !

★

III

ఖబడ్దార్ ఖబడ్దార్
నైజాం పాదుషా హే;

బానిసత్వ విముక్తికై,
రాక్షసత్వ నాశముకై,
హిందూ ముస్లిం పీడిత
శ్రమజీవులు ఏకమైరి.

తమపై స్వారీచేసే
దేశముఖుల ప్రతిఘటించి
ప్రజాకోటి పోరుతోంది.
ఖబడ్దార్! ఖబడ్దార్!!

సూర్యపేట, బాలేముల,
వీరుల కాలే హృదయపు
ఆశలు కాంతించుతాయ్.

అమరుడు మా కొమరయ్య;
అనంతయ్య అనంతుడే -
అజేయులై, ప్రకీర్తులై,
చిరస్థాయి నిలుస్తారు;
చరిత్రలో చరిత్రలో
చిరస్థాయి వసిస్తారు.

ఒకవీరుడు మరణిస్తే
వేలకొలది ప్రభవింతురు!
ఒక నెత్తుటి బొట్టులోనె
ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు;
ఖబడ్దార్! ఖబడ్దార్!!

నైజాం కీచకుడా!
నీ పీచమణచ ప్రజలంతా
ఒక పిడికిట, ఒక గొంతుక,
ఒక మ్రోతై, ధ్వనిస్తారు;
మృతవీరుల స్మరిస్తారు;
నవయోధుల సృజిస్తారు;
ఖబడ్దార్! ఖబడ్దార్!!

బానిస జన శల్యములను
ఏర్చి కూర్చి నిర్మించిన
నీ రాక్షస సింహాసన
మదిగదిగో కదులుతోంది!

మెషిన్‌గన్లు, మరఫిరంగి,
తుపాకులూ, విషవాయువు,
ప్రజాశక్తి నాపలేవు;
ఖబడ్దార్! ఖబడ్దార్!!

నిరవధికం నిరంకుశం
సహింపనీ భరింపనీ

ధీర ప్రజాకోటికొరకు
త్రవ్వించే గోరీల్లో,
నీ అమానుషత్వాన్నే
నీ నిరంకుశత్వాన్నే
పాతేస్తాం! పాతేస్తాం!
పాతేస్తాం! ఖబడ్దార్!
విశాలాంధ్ర ప్రజాస్వామ్య
మమరుస్తాం ఖబడ్దార్!

★

IV

అతడెవరు ? అతడెవరు ??
జనగామలో జమ్మి
కొమ్మపై ఎక్కాడు !
అతడెవరు ? అతడెవరు ??

గాండీవమును వెదకు
విజయుడలె నున్నాడు !
అతడెవరు ? అతడెవరు ??

అతడా ? — తెలంగాణ
గెరిల్లాల నాయకుడు ;
అతడే ప్రజాసమర
ఉద్యమోత్సాహకుడు !
అతడే ప్రజాస్వామ్య
జగతి కధ్యాపకుడు ;
అతడే తెలంగాణ
గెరిల్లాల నాయకుడు ;

పాంచ జన్యమ్ము
పూరించుచున్నాడదే !-
సమరోత్సవమ్ము వలె,
భూమాత పిలుపు వలె,

కొమ్ము బూరాను
పూరించుచున్నాడదే :
"శత్రువులు శత్రువులు
శత్రువులు వస్తారు ;

ప్రజలు నడుములు కట్టి
నిలువండి, గెలువండి...."

పుడమి గర్జించింది ;
పుడమి గర్జించింది.

శత్రువులు శత్రువులు
శత్రువులు వచ్చారు ।
శత్రువులు జనగామ
ముట్టడిస్తున్నారు ।
పెట్రోలుతో ఇళ్ళు
తగులబెడుతున్నారు ।
ఆధునిక ఆయుధాల్
దాడి చేస్తున్నాయి ।

పుడమి గర్జించింది ;
పుడమి గర్జించింది ;
ఇంటికొక మానవుడు
వీరుడై పొంగాడు.

రాక్షసుల కంఠాలు ;
మానవుల ఖడ్గాలు,
మానవుల మానాలు :
దానవుల దాహాలు ;

లేళ్ళ నెత్తురు త్రాగి
కైపెక్కు బెబ్బులులు ;
స్వేచ్ఛామృతము గ్రోలి
మైమరచు దేవతలు.

నరమాంసమును ఒలిచి
భక్షించు రాక్షసులు ;
విప్లవాగ్నిని రగిలి
ఉడుకెత్తు దేహాలు.

ఘోరమై, భీభత్స
రూపమై, జనగామ ;
రక్తమై, పైశాచ
భుక్తమై, జనగామ.

నరరూప రక్కసులు -
క్రకచాత్మ కర్కశులు.

పసికందు గుండెలను
పిండి పీల్చేస్తారు ;
మిసిమి యువతుల, ఉ
రోజముల చీల్చేస్తారు.

నరరూప రక్కసులు,
క్రకచాత్మ కర్కశులు.

పుడమి గర్జించింది ;
పుడమి గర్జించింది.
ఇంటికొక మానవుడు
యోధుడై నిలచాడు.

శ్రమిక జాతికి శిరో
మణులు దీపించారు ;
పుడమితల్లికి తనువు
పులకరించింది.

వీరుల సమూహమై
కదిలింది జనగామ :
విప్లవ ప్రవాహమై
పొంగింది జనగామ.

రైతులూ కూలీలు
బాధితులు పీడితులు
రణయోధులై మహా
శక్తి చూపిస్తారు.

పుడమి గర్జించింది ;
పుడమి గర్జించింది ;
పుడమివీరుల తల్లి
పులకరించింది.

అతడెవరు ? అతడెవరు ? ?
ప్రళయకాల మహా
రుద్రుడై అతడెవరు !
తాండవ జటాజనిత
భద్రుడై అతడెవరు ! !

అతడే తెలంగాణ
గెరిల్లాల నాయకుడు.

తిండితిప్పలు లేవు ;
ఎంతటి మహాశక్తి !
లేదసలె విశ్రాంతి ;
ఎంతటి మహాశక్తి ! !

హత్యను జయించాడు;
మృత్యువు జయించాడు;
అమర వీరుండతడు;
అమృతము త్రాగాడు.

ప్రజావాహిని ఎదురు
దాడులకు సిద్ధమై
సాయుధ తరంగాల
ఉరకలై పొంగింది.

ప్రజలందరూ ముందు
కురికారు విజయులై;
ఈటెలూ, బల్లెములు,
నాటు బందూకులూ,
రోకళ్ళు, కారాల
మూటలతో కదిలారు.
కూల్చారు రక్కసుల;
గెల్చారు శత్రువుల;
ఎంతటి మహాశక్తి!
మృత్యువు జయించారు;
హత్యను జయించారు;
జనగామలో విజయ
భేరి మ్రోగించారు.

★

V

నూతన వసంత శర్వరి
దీర్ఘమైన వెన్నెల - తెరచాపల నిలపిన
పూతనదీ పులిన స్థలముల
పాతిన విజయ ధ్వజములు ! -
గుండెల్లో ఎర్రని అభిమానం
తొణికిసలాడుతు ఎగిరే పతాకాలు !

భయంవంటి సమయంలో
మెల్లగ శ్వాసించిన శర్వరి

పచ్చని పచ్చిక బీళ్ళకు,
అడవి పొదల గుబురుల జీబురు
జీమూతాలకు, హృదయం వలె
శబ్దించే చీకటి - నాడులు !
- అసహాయత ధ్వనిస్తున్న కీచురాళ్ళు :
"అన్నల్లారా ! ఆదుకోండి
ఆనందం పంచుకోండి !"

పేరిన నిశ్శబ్దంలో
ఘనీభవించిన భీభత్సం
పతేలుమని ఒక్కసారి పగిలింది.
పదహారేడుల బాలుడు ;
పేదల శ్రమజీవుల రాజ్యానికి
రక్షణకై, రాత్రిజాము పహరాలో,

తన గుండెల నిండిన మూగ తలపులకు
ప్రతిధ్వనులుగా పక పక నవ్వేను.

తుపాకి పట్టిన రెండు నెలల్లో
పొందిన అనుభవాల భవనాలను
పరివేషిస్తూ,
భవనపు సోపానాలను
ఒకటొక్కటి అవరోహిస్తూ,
పేరుకున్న బీభత్సం
దద్దరిల్ల ఫక్కున నవ్వేను.

తెలుగుతల్లి ముద్దుబిడ్డ డావీరుడు ;
పేదల శ్రమజీవుల కన్నతండ్రి ;
ఆంధ్రమాత దివ్యచరిత
ప్రసవించిన ధీరగెరిల్లా !
తెలుగుతల్లి నోముపండి
ప్రభవించిన వీరగెరిల్లా :
బాలచంద్రునకు సోదరుడట !
రుద్రమాంబ తోబుట్టినవాడట !

సున్నితమగు కంఠ ధ్వనితో,
పసిగొంతుక కంచుస్వరంతో,
భయంపగిలి పగ మేల్కొన
ఫక్కున నవ్వేను.

ఆ నవ్వుల చప్పుడు
చప్పున వ్యాపించిన

కొండల లోయల్లో
పౌరుషాగ్ని మండిన
కాగడాల వెలుగులు।

పహరాలోని గెరిల్లా
ప్రమాదాన్ని పసిగట్టెను :
"అర్ధరాత్రి దాడులకై
ముష్కరు లొస్తున్నారా ?"

పహరాలోని గెరిల్లా
ఆలోచనవలె మెరిసెను....

గుహలోపల కునుకుతున్న
తోటి పులుల మేల్కొల్పెను :
"నిద్దుర లెండోయ్, కామ్రేడ్స్ ।
పందులు చొరబడుతున్నయ్ ।"

ముగ్గురు వీరగెరిల్లాల్ ।
ముగ్గురు విప్లవ వీరులు ।
సింహం కొదమల వలె
కొండకొమ్ము కెగబ్రాకిరి....

'ధణా.... ధణా.... ధన్'

* * *

కీడులోక మంతరింప
మూడు తుపాకులు పేలెను ;

* * *

ఊరువైపు నడుస్తున్న
శత్రువు లాశ్విక దళములు,

గురితెలియని తుపాకిగుళ్ళకు,
చితాచితలై చిందరవందరగా
నలుముఖాల కంగారైనవి.

కీడులోక మంతరింప
మూడు తుపాకులు పేలెను:

'ధణా....ధణా....ధన్!'

కన్నులు చీకటి కమ్మిన
గుఱ్ఱములు సొలోపు పట్టెను.

రోడ్డుప్రక్క త్రవ్వబడ్డ
కందకాల బురదల్లో
గుఱ్ఱాలూ, గూండాలూ
కూరుకుపోయిరి

* * *

కొండకొనను తుపాకి బారులపై
క్షణంలోనె రైఫిల్ జ్వాలలు
ఆక్రమించి ముంచెత్తినవే!

నైజాం దుండగీడు మూకలు
కురిపించిన రైఫిల్ జ్వాలకు
గెరిల్లాలు, తెలుగుతల్లి బిడ్డలు!
గురియై బలియై పడిపోయిన వీరులు!-
దేశంపై తరుగని అభిమానంతో
అభిమన్యులవలె పుడమితల్లి
ఒడిలో ఒరిగిరి.

చేతనున్న తుపాకి తూటాలన్నీ
సమరంలో వ్యయమైపోయినవా?
నూరేడుల పచ్చని బ్రతుకంతా
ఉప్పెన ఒక్కసారి ధూళై పోయిందా??
తెలుగుతల్లి పసిడికాన్పు చివరికి
కడుపుశోకమై మిగిలిందా???

కాదు, కాదు.
లక్షలాది సోదర జన క్షేమంకోసం
నెత్తురొడ్డి నేల కొరిగినారే!
అదేచాలు పదిలక్షలు.

తుది నిశ్వాసం వదిలే
భీతివంటి అంతిమ ఘడియల్లో
తమ తల్లికి తోబుట్టినవారికి
ఏమిచెప్పి పోయారా వీరులు?
మూడుకోట్ల తెలుగుల
విశాలాంధ్ర దేశానికి
కడసారొసగిన
విప్లవ సందేశాలేమిటి?

"తల్లీ ఏడువకమ్మా!
ఈ క్షతగాత్రుల, గతజీవులకోసం,
నీ దాస్యవిమోచన కంకణు
లున్నారమ్మా అన్నలు;

తల్లీ ఏడువకమ్మా!
మళ్ళీ జన్మన్నది మాకుంటే

చల్లని నీ కడుపున జన్మిస్తాం;

మిమ్ముల విడిచిపెట్టి పో
లేమయ్యా అన్నల్లారా!

మీ గుండెల్లో మండుతున్న
పౌరుషాగ్ని జ్వాలల్లో
కలకాలం జ్వలిస్తాము.

ఆదుకోండి అన్నల్లారా!
ఆనందం పంచుకోండి."

మరణించిన మన తమ్ముల
అంతరాత్మలు తెలుగుజాతి
దేహానికి ఉక్కుకవచమై,
రక్షాబంధనమై, దీక్షాకంకణమై,
చిరకాలం నిలుస్తాయి;
ప్రాణంలోపలి జ్యోతిగ
వెలుగుతాయి.

మరణించిన మన తమ్ముల
ఆత్మల ఆనందానికి
పిడికిలి బిగించి నేడే
పోరాటం సాగిద్దాం.

నాజీ నైజాం రాక్షస రజాకార్ల,
పోలీసుల, ద్రోహుల రక్తంతో
మన తమ్ముల ఆత్మల శాంతికి
దోసిళ్ళతో తర్పణమిద్దాం.

★

VI

రాక్షస రాజ్యంలో
నెత్తురు వెచ్చించిన బందీలకు,
చచ్చిన బందీల వారసులకు,
చైతన్య ప్రవాహమున
జీవం చిగురించినదా ?
క్రూరులు వేటాడే బానిసలకు
ప్రాణం ప్రవహించినదా ?

బానిసలంతా ఒకటై
మానవులై నిలచినారు।

బందీలంతా ఒకటై
యోధులుగా వెలసినారు।।

బానిసలంతా ఒకటై
ఆయుధాలు ధరించారు।

బందీలంతా ఒకటై
అడ్డుకట్లు త్రెంచినారు।।

బానిసలూ, బందీలూ అంతా
ఒకేగొంతు వినదించారు :

"మోసపు టుచ్చుల కుట్రలు
మన గొంతుల బంధించవు ;
మన చేతుల బంధించిన గొలుసులు
మంచుబిందులై నేలపడును।"

గాఢనిద్రలో కూర్కొన సింహాలన్నీ
నేటికి జూలు దులిపి మేల్కాంచెను.

* * *

అశనిపాతమ్ము వలె, బడబానలమ్ము వలె
ముసిరిన తుఫాను వలె, విరిసిన విపత్తు వలె
దానవుల దుర్గాల నధిగమిస్తోం దహో!
ప్రజావీరులకోవ!.... యోధుల పటాలమ్ము!

* * *

సాధారణ బానిసలే
శిక్షితులగు సైనికులై
క్షణంలోనె మేరువులై
విశ్వంలో వెలుస్తారు!

సాధారణ మానవులే
శిక్షణగల సైనికులై
విలయ విస్ఫులింగాలై
జగత్తులో జ్వలిస్తారు!

కర్రసాము....కత్తిసాము....
కవాతులూ....ఎదురు దాడి....

సాధారణ బానిసలే
సాహసులై గర్జించిరి;

శత్రువు వ్యూహాలన్నిటి
తొలిదెబ్బకు చిత్తుచేసి
ఓడిస్తూ నడుస్తారు;
అంగలార్చి నడుస్తారు.

నిరాయుధులు సోదరులే
నిరపరాధులు మానవులే
చీకట్లో చీకటి వలె
మసులుతారు ;

చీకట్లో ఎర్రని భూతాలై
దానవులను మ్రానుల వలె
కూలుస్తారు.

సమర భూమి
విజయానందం వలె వనితలు !
ఎక్కిడిన ధనస్సులై వనితలు !!
రక్కసులకు ప్రళయకాల కాళికలై
భయపెట్టే నారీమతల్లులు !!!

యుద్ధం !.... యుద్ధం .... ! యుద్ధం !
బీభత్సం !.... రణగర్జన !....

ప్రళయకాల ఝంఝూనిల
ఘాతవృక్ష సమూహాలు —
గుట్టలుగా నేలరాలు పాషాణములు.

* * *

భవిష్యత్తు స్వరూపాల
చరిత్ర గతి లిఖిస్తోంది ;
విశ్వవాణి గొంతుకలో
కొత్తజీర పలుకుతోంది :

NATIONAL ARCHIVES OF INDIA

"ఈ యాగం ఫలిస్తుంది ;
రాక్షస సంహారోత్సవ
మహాక్రతువు ఫలిస్తుంది ;
ప్రయత్నాలు ఫలిస్తాయి.

"బందిపోటు పిశాచాలు
నశిస్తాయి ; నశిస్తాయి ;
తెలుగుగడ్డ సుఖిస్తుంది ;
ఈ యాగం ఫలిస్తుంది.

"తెలుగుతల్లి పసిడికాన్పు
కొత్తపంట ధరిస్తుంది ;
నవజీవం సుమిస్తుంది ;
ఈ యాగం ఫలిస్తుంది."

★

NATIONAL ARCHIVES OF INDIA

VII

తెలుగుగడ్డ నడిబొడ్డున
విలయం వలె నిలచిన కొండలు -
నవ్వుతున్న నల్లని కొండలు ;
నల్లగొండ పరిసర ప్రాంతాలకు
ప్రతిధ్వనులు వ్యాపించిన నవ్వులు -
నల్లగొండ తెల్లని నవ్వులు ।
విజయానందంతో
పారవశ్య మొద్దులొరసి
పకపక నవ్వుతున్న
నల్లని కొండలు ।।

అడవులు బంజర్లూ బీళ్ళూ
ఏకంగా సమతల మొనరించిన రైతులు ।
ఉమ్మడిగా సౌఖ్యం పండించిన రైతులు ।
భూదేవత కన్నుల పంటలు ।।

నల్లగొండ లోయల్లో
గుమిగూడిన పేదల
కూలీరైతుల సభలో
లక్షమంది నినదించిన కోర్కెలు ।
ఆశల ప్రతిధ్వనించిన లోయలు ।।

ప్రజారాజ్య పరిషత్తుల
ఎన్నుకొన్న ఘడియలు ;

పంచాయతీల పరిపాలన
పల్లెల్లో వెల్లివిరిసి
పొంగిన ఆనందం ;
స్వేచ్ఛా నవజీవన రాజ్యాంగం
నెలకొల్పబడిన శుభసమయం ;
నూతన చట్టాలకు
పట్టం గట్టిన ఘడియలు
ప్రాణం పోసిన కాలం.

పుడమితల్లి పసిడిపంట
మానవులంతా కాచుకొనే న్యాయం ;
పుడమితల్లి బంగరు పంటలు
నరులంతా సోదరులై పంచుకొనే ధర్మం

కొండలలోయల్లో బయళ్ళలో
ఆ హోరాహోరీ రణరంగంలో
ప్రత్యర్థుల తునుమాడే న్యాయం ;
కత్తివంటి ప్రజావాణి న్యాయం.

తెలుగుగడ్డ నడిబొడ్డున
నిలచిన నల్లని కొండలు ;
నవ్వుతున్న నల్లని కొండలు.

తమ బిడ్డలు పాలకులై
పరిధిలేని సంబరాల
పండుగ సరదాలను
సర్వత్రా సంతరించు సమయంలో
ఆనందాశ్రుల చిమ్ముతు,

విరుల వాన కురిపిస్తూ,
పకపక నవ్వుతున్న
నల్లని కొండలు।

ఈ నవయుగ వర్షంతో
హర్షంపొందిన కర్షకులంతా
కోలాహలమున
రాక్షస ఘీంకారవ చీకటి నేలను
చీల్చిచీల్చి దున్నిన
కిలారింపు నవ్వులు -
నల్లగొండ తెల్లని పువ్వులు।

పరిసర ప్రాంతాలకు.
తెలుగుల దివిసీమకు ;
ప్రతిధ్వనులు వ్యాపించిన
నల్లగొండ నవ్వులు।
తెలుగుతల్లి పచరించిన
ముత్తెపు ముగ్గులు।।
కల్లోలం వెలిగ్రక్కిన
తెల్లని నురగలు
సాగర ముప్పొంగిన
తరంగాలు।।।

★

VIII

ఎగరేయ్! ఎగరేయ్!
ఎర్రెర్ర జెండా!
మన ఎర్ర జెండా!

సర్వజన స్వాతంత్ర్యదాతా!
సౌభాగ్య శాంతిప్రమాతా!!
మన ఎర్రజెండా!

యువశక్తి నవశక్తి సంయుక్త ధాతా!
సర్వ సమానత్వ స్థాపనోద్భూతా!
మన ఎర్రజెండా!

ఐక్యకంఠము విప్పి పలికించు జెండా!
సౌఖ్యస్థాపనకొరకు కష్టించు జెండా!
మన ఎర్రజెండా!

కష్టజీవుల కలత కదలించు జెండా!
మృష్టాన్నసిద్ధికై పోరాడు జెండా!
మన ఎర్రజెండా!

లేవోయి శ్రామికా!
లేవోయి కర్షకా!
నీ జీవితాశయము
ఫలియించు సమయమ్మ
నీ జీవితాంబరము

NATIONAL ARCHIVES OF INDIA

శోభించు సమయమ్ము
నీకోసమే, స్వర్ణ
    యుగ సృష్టికే

ఇదే కదలి వచ్చెను చూడు
అరుణోదయ జ్యోతి!
లేవోయి రావోయి
ఎర్రజెండా నీడ
    కిదె కదలి రావోయి!

బానిసత్వపు బరువు ఛేదించు జెండా!
మానవత్వపు తెరువు చూపించు జెండా!
    మన ఎర్రజెండా!

సర్వజన సౌభాగ్య త్రాతా!
అభ్యుదయ శాంతిప్రదాతా!

    ఎగరేయ్! ఎగరేయ్!
    మన ఎర్రజెండా!
    మన ఎర్రజెండా!

మలయా ప్రభంజనం

NATIONAL ARCHIVES OF INDIA

1

ఓహో హో మలయా
క్రాంతికీల నిలయా

ఏనాడో చికాగోలొ - మాస్కోలో
ఏనాడో పారిస్‌లో - బెర్లిన్‌లో
ఏనాడో మీరట్‌లో - క్వాన్‌టన్‌లో
కరిగిన శ్రామికవిప్లవ మహానదులు నీలో
నీ నాడులలో, నరాలలో, ప్రవహిస్తున్నవి మలయా!

ఓహో హో మలయా!
క్రాంతికీల నిలయా!

మార్క్డొనాల్డు - నియ స్తలను, చరిత్ర
డస్టుబిన్‌లో పడేస్తుందిలే మలయా

ఓహో హో మలయా!
క్రాంతికీల నిలయా!

మనకాలం పేరుమీద మ్రోయించిన బంగరు గంటల
ప్రకంపనంలో కదలిన లోహపు నాలుక
లెన్నో విడిచిన చప్పుడు - కెరటమ్ములు
గింగురులను మేళవించి, మము రణరంగానికి
రమ్మని చేతులెత్తి సైగలు చేసినవే మలయా

ఓహో హో మలయా!
క్రాంతికీల నిలయా!

★

NATIONAL ARCHIVES OF INDIA

2

గడచిన దినాల గడియారంలో
తెగిపోయెను - మెయిన్‌స్ప్రింగు!
గతకాలం - జీవిత కైవారంలో
తాండవమాడెను - వికృత భూతం:
కోలాటం పాటలతో, కోలాహల గీతులతో
నర్తించెను వికార మేఘం!

తన యొడిలో లాలించే సంద్రం
ఎత్తిన ఎన్నెన్నో గొంతులతో
వినిపించెను హెచ్చరికలు!

నీ వారధి హెచ్చరికలు, నీ నవ్వుల చివరికొసలు
మా లోపలి చెవిలో వినిపించెను పిలుపులు!

★

3

పుడమి తల్లి పొత్తికడుపు
వాచిన దేం కారణమే ?
ఆతురులై ఆడవాళ్ళు
సెకన్లు లెక్కించే దెందుకొరకు ?

భవిష్యత్ జాతకాల గణితం
ఏం చెబుతోందే....?
ధరణీమాత వెన్నుబాము
కొంకిర్లవుతోందేమే....?

భావిలేని భవిష్యత్తు - రేపులేని రేపులకై,
నవ్వే, కుసుమించే ఆ రేపును ప్రసవించేందుకు
భూదేవత చేదుమందు తింటోందే....

కాలం వలె మానవుడూ అమరుడు.

ఎర్రపడిన తొలివేకువ తెల్లారే లోపల
ఉదయకాంతి హాసంలో, ఉషోమూర్తి వేషంలో,
ప్రజ్వలుడై మానవుడే
కాలంవలె ఉదయిస్తాడని
చరిత్ర మా చెవిలో రహస్యాన్ని ఊదినదే....!

NATIONAL ARCHIVES OF INDIA

భూతకాల పరిపాలకు లతిరథులూ మహారథులు,
భూతలోక భేతాళులు, ఊర్ధ్వజగత్కబంధులూ
అగాధమగు నిరాశలో కూరుకుపోయిన మనోరథులు!
నిశ్శబ్దంలో మునిగిన కర్ణులుగా, వికీర్ణులుగా
పాతల పాతాళం బెందడిలో దిగబడిపోతున్నారే!
అహిరావణ మహిరావణులై ఇహలోకం పరిత్యజిస్తున్నారే!!

ఉషోమూర్తి అమరమానవుడు
కాలంవలె ప్రభవిస్తున్నా డల్లదిగో ....

★

4

శిశిరఋతువు వృక్షవితతి వలె
మౌనంగా రంగంలో
పూవుల, ఆకుల సర్వదళాలను రాలుస్తున్నాదా
ఓ మలయా మన అరివర్గం?

తొడిమ విడిన నవ్వుల నువ్వుపూలు
గతకాలం మెడలో అలంకరిస్తున్నాదా
ఓ మలయా మన అరివర్గం?

అంచాతనె ఈ రోజున
అచేతనంగా నిలబడిపోయిందా
ఓ మలయా మన అరివర్గం?

చీకటిలో నిలచిన నల్లని క్రీనీడల జాడలు
తమవేనని పోల్చుకు వెనక్కి వెళిపోతున్నాదా
ఓ మలయా మన అరివర్గం?

వసంత వాహిని పురోగమించే సమయంలో
పాపం! - శిశిరంలా శిరంవంచి తిరోగమించక ఏంచేస్తుందే
ఓ మలయా మన అరివర్గం?

ఓ మలయా మన అరివర్గం
చూస్తూ చూస్తూ చస్తుందా మరి?
ఆలోచిస్తూ.... యోచిస్తూ....
వెనక్కి వెనక్కి నడుస్తుంది!!

ఓ మలయా మన అరివర్గం
పునశ్శక్తి సముపార్జనకోసం
మకరధ్వజాన్ని సేవిస్తుంది.
అణువుల నిట్టూర్పులు విడుస్తుంది.

★

5

అవిగో
మన శత్రుజీవితపు తుహిన కణాల్....
అరుణోదయ ప్రభాకలిత కిరణ పరంపరలకు,
కుపితారుణ నేత్రజ్వాలా తోరణములకు,
కాలిక్రింద కాలిన రేణువులకు,
సుంగి, స్రుక్కి, ఇంకి విశీర్ణాకృతులై
ఉనికి విడిచి మాయమయ్యె గతంలోకి!

ఎర్ర వెలుగు విశ్వరూప సందర్శనలో
నిటారుగా చేవదేరి నిలచిన
తాళవృక్ష జాలములే
నలుమూలల మలసెను, సజీవ చిత్రములను!

అవిగవిగవిగో!.... అంతరిక్ష మార్గంలో
నిప్పుల దుర్గాలై.... తేజస్స్నిగ్ధాలై
పరిభ్రమించెను, ఖగోళ గోళమ్ములు!

భూగోళంలో
అలుముకొనెను గందరగోళం.
భూగోళం అట్టడుగున
ఆఖరిపొర పర పర చిరిగెను.

ఖగోళ గోళంలో ప్రభవించెను పిడుగుల వర్షం!
ఫెళ ఫెళ ఫెళ్ళగిలెను భీకర శబ్దం!!
దశదిశలకు చెలరేగెను విలయధ్వానం!!!

అదిగదిగో!
వినిపించెను, శంఖఘోష....
నక్షత్రాలే, రథచక్రాలై
తిరునాళ్ళకు తరలిన సమూహమై
అంతరిక్ష మార్గంలో జరిపెను,-
మానవ విజయోత్సవ ప్రస్థానం!

★

6

కాకీ యూనిఫాం ధరించి మృత్యువు
కవాతు చేస్తున్నది - గబగబగబ....
పిస్తోల్‌వలె పిపాస చెలరేగిన విరోధి
ప్రళయ తాండవం చేస్తున్నా డణువు మీద....।

లావా వలె కాలం ఆరగా
ప్రవహిస్తున్నది వడిగా....
నిశీధి నల్లని కుత్తుక
తెగిపోతున్నది వడిగా....
వెచ్చని ఎర్రని రక్తం
ప్రవహిస్తున్నది వడిగా....
చీకటి - కుటిలో కూర్చుని
వల్లకాడు పల్లవి పాడే
దినాలు పయనిస్తున్నవి వడిగా....
కాలం జలపాతం వలె
ప్రవహిస్తున్నది వడిగా....

కవాతుచేస్తూ విజృంభిస్తూ కదలిన మనసైన్యం
క్షణంలోనె గవిసెను — శత్రువు శిబిరం వడిగా....
పిపాసతో గర్జించిన మనపిస్తోల్ -
విరోధి రుధిరంతో చల్లారును - వడివడిగా....

★

7

చిరిగిన అభిమానం కప్పుకొన్న నెచ్చెలి జీవితకధనం
ఈ అంతిమ పోరాటానికి కలిగించిన వెర్రని ఉత్సాహం!

భూకామందుల కామాంధుల హయాములో
ముండామోసిన బీడుగ మారిన సుక్షేత్రం,
పచ్చని పంటలకోసం గాసిల్లిన సుక్షేత్రం,
పీడితజన శృంఖల విచ్ఛేదానికి కలిగించిన ఉద్రేకం!

ఆర్తులు తమ ఆకలి తీర్చుకొనే అవసరాన్ని
గుర్తించిన గుణపాఠం - నేర్పిన విజ్ఞానం
జనహృదయంలో రగిలించినదీ ఉజ్వలార్తి!

టెక్స్టయిల్ మిల్లులోని నైట్‌డ్యూటీ ముగించుకొని
పనివాడొకడింటికి చేరుకొనేసరి కల్లా
చలిలో కొయ్యబారిపోయిన చంటివాని కళేబరం
నేర్పిన విజ్ఞానం: ఈ మహాశక్తి ఉగ్రమూర్తి!

చెరుకుతోట బోదెలు తవ్వుతున్న కూలీ పారమొనకు
తెగిపోయిన బొటనవ్రేలి నరాల రక్తం:
ఈ పోరాటానికి మూలం!

★

8

నిప్పువంటి ఆకలి కీలల్లో కాలిన
ఎఱ్ఱని నాలుక ఊదిన గాలి దుమారం.
మలయా విప్లవం!

రెక్కలుగల వర్తమానకాలానికి ఎదురయ్యే
దుడుకుపాట రేపుల గొంతుకలో కలిసిన గానం.
మలయా విప్లవం!

పాటలశబ్దం చీల్చిన నిశీధి నిశ్శబ్దం వలె
ఆగత కాలపు కాంతులు చీల్చిన గతకాలపు చరిత్ర తిమిరం
మలయా విప్లవం!

★

NATIONAL ARCHIVES OF INDIA

9

ఓహో హో మలయా!
విప్లవాగ్ని నిలయా!

పాపిష్టులు పాలకులై మన మెదళ్ళ కల్లిన
దళ్ళన్నీ చీలిపోయి కూలిపోయినవి నేటికి!

గంతలు కట్టిన కన్నులతో స్మశాన లోకాలకు
మన బ్రతుకులు పయనించుట మానెను నేటికి!

ఎండిన పొలాల నెరియల నతికిన వానజల్లు వలె
మన గుండెల బీటల నతికెను ఈ అమృతగమ్యం నేటికి!

ఓహో హో మలయా!
విలయానిల నిలయా!

★

10

ఆశియా ఆశయం : ఆగ్నేయనేత్రం!

కలవారి శృంగార కావ్యాల భరతం,
-జీవిత పథాలలో భీభత్స దృశ్యం,
-నల్లనల్లని నీడ లడుగిడిన మార్గం,

మలయా విప్లవం!
మలయా విప్లవం!

ఆశియా ఆశయం : ఆగ్నేయనేత్రం.

రారాజు గాథలకు ఇదె స్వస్తివాక్యం,
శత్రువుల చరిత కిది అంతిమ స్కంధం.
కాలవాహిని కిదే నూత్నఘట్టం,

మలయా ధ్యేయం!
మలయా వ్యూహం!

ఆశియా ఆశయం : ఆగ్నేయ నేత్రం.

గాయపడి బొబ్బలిడు బెబ్బులి పరాక్రమం,
ఆకలికి రంకెలిడు సింహాల క్రౌర్యం,
పగబట్టి వెన్నంటు సర్పాల శౌర్యం,

మలయా మారుతం!
మలయా దుమారం!

ఆశియా ఆశయం : ఆగ్నేయ నేత్రం

కొత్తజీరలు తెరచి మొరసినది కంఠం,
కొత్తఅలుగులు కూర్చి వెలిసినది బాణం,
కొత్తరేకులు విచ్చి మెరిసిన పతాకం.

మలయా వక్త్రం!
మలయా అస్త్రం!

ఆశియా ఆశయం : ఆగ్నేయ నేత్రం

బానిసల విప్లవం - ఉత్సాహ సమరం,
శ్రామికుల స్వప్నం - పోరాట ఫలితం,
పీడనా రహితం - సౌజన్య జీవితం,

మలయా విప్లవం!
మలయా విప్లవం!

రచయిత

ఆవంత్స సోమసుందర్, కవీ, కధకుడూ. 1924వ సంవత్సరం నవంబర్‌లో పెద్దాపురం తాలూకా శంఖవరం గ్రామాన జన్మించాడు. కాళ్ళూరి వెంకాయమ్మ, సూర్యప్రకాశరావులు కన్నవారు; ఆ రోజుల్లో అల్లూరి సీతారామరాజుకు ఆశ్రయమిచ్చారనే నేరంమీద ప్రభుత్వం తండ్రిగారి గ్రామకరిణీకాన్ని ఊడలాక్కొని ఆయన్ని చెరసాలలోకి పంపింది. ఆర్గురు అన్నదమ్ముల్లోనూ ఆఖరివాడవటంవల్ల ఆవంత్స వెంకాయమ్మ, వెంకట్రావు గార్లకు 1929 లో దత్తుడయ్యాడు. అక్కణ్ణుంచి పిఠాపురంలో స్థిరపడ్డాడు. సుమారు 1933 నుంచి 1945 వరకూ పిఠాపురంరాజాహైస్కూలు, కాకినాడ కాలేజీ కొంత చదువుచెపుతామని ఒప్పుకొన్నాయి. కాని, ఈయన కొంత తెలివిమీరి వాటికే పాఠాలుచెప్పటానికి పూనుకోవటంవల్లా, ఆంధ్ర విశ్వవిద్యాలయం చదువు మరణశాసనాల్ని వినిపిస్తూండటంవల్లా 1945 లో బైటపడ్డాడు. ఇంచుమించు 1944 వరకూ కూపస్థమండూకంలా చతుష్పాదుల్లోను, ప్రణయ కవిత్వంలోను బ్రతికిన మనిషికి జీవితం కొత్తపాఠాల్ని నేర్పింది. ప్రజాజీవితం నగ్నంగా కళ్ళముందు తో[illegible] సరికి తానే ఒక ఉద్యమమని గ్రహించాడు; దానితో విశ్రాంతిలేని జీవితం ప్రారంభమయి[illegible] ఈ దేశం యావత్తూ శ్రామికుని వీపుమీద తన భారాన్ని మోపుకున్నదని తెలుసుకొన్నాడు. అంతటా మనుష్యులు చెమర్చటం చూశాడు. ఆ చెమటనుంచే ఇతరులు పానకాన్ని త్రాగటం గ్రహించాడు. మేటి గురువులైన (క్షమించాలి: ఆంధ్ర విశ్వవిద్యాలయం కాదు) ఆకలీ, నిరుద్యోగమూ– ఈ రెండూ ఈ సూక్ష్మసత్యాన్ని ఈ రచయితకి ఉద్బోధించాయి. కనుకనే ఈ అజేయమైన వజ్రాయుధాన్ని ప్రజాహస్తగతం చేశాడు; స్వతహాగా కవి. సరదాగా కధకుడు.

KALAKELI Publication

One Rupee.

VAJRAYUDHAM By SOMASUNDER.

"ఒక వ్యక్తియొక్క సాంఘికజీవితమే అతని చైతన్యాన్ని నిర్ణయిస్తుంద"ని కారల్ మార్క్స్ చెప్పాడు. ఈకవి పాడటానికి గొంతు సవరించుకుంటూన్న రోజుల్లోని చరిత్ర భూస్వామ్య వ్యవస్థ నశిస్తూ, బూర్జువావ్యవస్థ పరిపాలనాధికారాన్ని ఆశిస్తూన్న కాలమని చెప్తుంది. ఆనాటి కవిత్వం విరగబడి సనాతన చైతన్యంమీద తిరగబడి కొత్తకొత్త దారుల్ని త్రొక్కి-త్రొక్కి విసిగి వేసారి చివరకు వెగటుగా, వికారంగా, విషాదంగా, ఆత్మఖండన వ్యాపారంగా తయారయింది. బూర్జువావర్గపు ఉనికికి అనుకూల వాతావరణాన్ని వ్యక్తిగత అహం కలిగిస్తుంది కనుక ఆరోజుల్లో కవిత కదే నినాదమయింది. కవిత్వం పరిసర నగ్న వాస్తవికతను కళ్లు విప్పి చూడలేక 'నిరంజనమైన కళ'కోసం ఆకాశపు దారులు పట్టి "దిగిరాను దిగిరాను దివినుండి భువికి" అంది. దానితో "ద్రష్ట"అయిన కవి భ్రష్టుడై పోయ్యాడు; అతని అనుభూతి కూడా నశించిపోయింది. దానితో అసంఖ్యాకమైన ప్రజానీకం కవిత్వాన్ని చదవటం మానివేసింది; కవిత్వం తమ కవసరమనే సంగతినే విస్మరించింది; కనీసం దానిని అర్థంచేసుకోటానికి కూడా అది ప్రయత్నించలేదు. ఎందుచేతనంటే కవిత్వం జీవితానికి అంత దూరమైపోయింది కనుక. ఈ సత్యాన్ని కవి గ్రహించాడు. అందుకనే కవి:

"తనచరిత్ర తనెపఠించి ఫక్కున నవ్వింది ధరణి
తనగాధను తనెస్మరించి భోరున ఏడ్చింది ధరణి"

అన్నాడు. అంతటితోటే అతను చెప్పదలచుకొన్నది పూర్తి కాలేదు; యధార్ధజీవితాన్ని సంగ్రహించి "బూర్జువావర్గం" తమ దోపిడి తమ పాలన తమ వర్గస్వలాభాల సుస్థిరముగ

NATIONAL ARCHIVES OF INDIA

నిలపాలని, సర్వజనానీకంపై ఏలుబడిని సాగించచూస్తున్నదనే పరమసత్యాన్ని అర్థంచేసుకొన్నాడు. అంతేకాదు; "రెండు ప్రపంచాలమధ్య, రెండు స్వభావాలమధ్య, రెండే వర్గాలమధ్య సాగుతున్న సంఘర్షణ"ని గుర్తుపట్టి తనపాత్రని పృచ్ఛించుకొన్నాడు. "యుగధర్మం: చైతన్యం— జనహృదయం: పోరాటం" అని తన అంతర్వాణి వినిపించింది. "ఉన్నదొక్క జీవితమే: మానవునిగ, వీరునిగా బ్రతుకుము నరుడా! చరిత్ర నీకోసం ప్రసవబాధ పడుతున్నది; భవిష్యత్తు నీకోసం పడిగాపులు పకుతున్నది. నీ త్యాగం వృధాకాదు" అని సంబోధించుకొన్నాడు. దానితో "దినమంతా రక్తం ధారవోసి పరిశ్రమించే దీనుల ఒక్కటిగా సమీకరించుటకోసం; నిర్దయగా పరాన్నభుక్కుల హతమార్చుటకోసం" ఉద్యమించాడు. "వర్గరహిత స్వర్గమ్మును స్థాపించు"ట తన 'లోపలి కోరిక'. తన 'తీరని తపస్సు'. కనుకనే ఆవేశంతో ఎలుగెత్తి పిలుస్తున్నాడు: "కదలండి కదలండి, కదలి పోరాడండి; తెలుగువీరుడు మరణమెరుగడని చాటండి; పిరికివానికి వేయి చావులని తెలుపండి: పోరండి పోరండి పోరండి బ్రతుకుకై: పోరండి పుడమికై; పోరండి స్వేచ్ఛకై— 'తుది తెలుగుమానవుడు బ్రతుకుపీడిందాక" ముందు కురకమంటున్నాడు; తనకు ఆశ; నిరాశ లేదు. కనుకనే "ఒకవీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు; ఒక నెత్తుటిబొట్టులోనె ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు" నంటాడు. అంతేకాదు. "ఈ యాగం ఫలిస్తుంది; రాక్షస సంహారోత్సవ మహాక్రతువు ఫలిస్తుంది; తెలుగుగడ్డ సుఖిస్తుంది; నవజీవం సుమిస్తుంది." అంటాడు కవి. అవును. తప్పదు. "రారాజు గాధలకు ఇదె స్వస్తివాక్యం; శత్రువుల చరితకిది అంతిమ స్కంధం; కాలవాహినికిదే నూత్నఘట్టం".

"కమ్యూనిస్టు కవిత్వం సంపూర్ణమైనది; మానవుడు తన అవసరాన్ని ఎంత చైతన్యంతో గుర్తిస్తాడో, అంత చైతన్యంతోటే బాహ్య వాస్తవికతని గుర్తిస్తాడు కనక" అంటాడు క్రిస్టోఫర్ కాడ్వెల్.

—ప్రకాశకులు.

అవంతీ ప్రెస్ - రాజమండ్రి.

A.B 946116 P3

జ్రాయుధం